# పగబట్టిన పాము



**పగ జ్వలిత జ్వాల వంటిది. పగ తీరేవరకూ గుండెల్లో రాజే అగ్నిగుండం పొగలు కక్కుతూనే ఉంటుంది. నుసిగా, మసిగా అణగారేవరకూ మంటలు చల్లారవు - పగలక్షణమే అంత. పాము పగ తీరనైనా తీరాలి-లేదా ఆ పగ సాధింపుకోసం ఎదురుచూసి ప్రాణాలైనా వదలాలి. విష జంతువులైన పాముల్లోనే ఏమిటి – మనుషుల్లోనూ పొగలు కక్కే పగలు చూడడం లేదూ?**

కొద్దిగా మొలకెత్తుతున్న పైరు పార్కులోని మెత్తని గడ్డిలా ఉంది. పిల్లగాలికి అది ఊగుతూంది; జోల పాటకు నిద్రపోయే పసిపిల్లాడిలా ఉంది. సూర్యు డస్తాద్రిని చేరబోతున్నాడు. ఎర్రని సూర్యకిరణాలు పచ్చని మొలక పైరుకు ఎంతో అందాన్నిచ్చాయి. ఆ చేనిమధ్య ఒక ఎత్తైనరాళ్లగుట్ట. దానిపైనున్నటి బండపై నేను, రాజారావు ఎదురెదురుగా కూర్చున్నాం. నేను కాలక్షేపం కొరకు ఏదో ఈలపాట పాడ సాగాను.

“వీడి దుంపతెగ! ఈ శర్మగా డింకా రాడేం?” అన్నాడు రాజారావు సంభాషణకు ఉపక్రమిస్తూ.

పాట ఆపి, “వస్తూ ఉంటాడులే” అన్నాను నేను.

“మనల్ని ముందు పొమ్మని వాడు చేసిన పని చూడు” అన్నాడు శర్మపై పెద్ద నేరం ఆరోపిస్తూ రాజారావు.

“ఏదో పనుండి ఆగిపోయి ఉంటాడు లేరా. ఇప్పు డేం కొంప మునిగింది?” అన్నాను కొద్దిగా విసుక్కుంటూ.

“మునిగిందని కాదురా. ఏ మునిగే పనుల్లోనైనా మన బభ్రాజమానం అఘోరించే దింతేగదా” అని అన్నాడు ఎత్తిపొడుస్తూ.

“అలాంటప్పుడు బాగానే ఉంటాడులే.”

“లే అంటే కుదరదు. ఇప్పుడు లేనిది, అప్పుడు మటు కెలా వస్తుందో చెప్పి తీరవలసిందే” అని బల్ల లేదు గనక ఆ ఉన్న బండనే కాస్త గట్టిగా గుద్దుతూ వాదనకు దిగాడు.

కాని, నా కా గొడవ తప్పిస్తూ, శర్మ సైకిలుపై వస్తూ దూరాన కనబడ్డాడు. కొద్ది నిమిషాల్లో రానే వచ్చాడు. తనకై కేటాయించబడిన స్థలంలో చతికిలబడి, 'రెస్టు' తీసుకోసాగాడు, శర్మ ఉరఫ్ బభ్రాజమానం.

కాని, అబ్బే! రాజారావు వదిలేస్తేగా?

“ఏంరా, ఇంత సేపూ 'టాయిలెట్' అవుతూనే ఉన్నావ్? అటు చూడు. సూర్యుడు నీ కోసం ఎంత కాలం కాచుకూచుంటా డనుకున్నావ్? అక్కడికే ఎంతోసేపు చూశాడు. ఈవేళ్టికి ఉట్టి పుణ్యానికి ఊరికే లభించవలసిన 'డి' విటమిను పోగొట్టుకున్నావ్. ఛీ, బభ్రాజమానం!” అన్నాడు.

“పోరా, నీ విటమినూ, నువ్వూను” అని శర్మ చొక్కా గుండీలు విప్పి గాలి పోసుకోసాగాడు.

“ఎందు కింతసే పున్నావ్?” అని అడిగాను నేను.

కాస్త ఊపిరి పోసుకుని శర్మ, “ఏం చెప్పమంటావ్రా, బ్రదర్సా! నే నలా 'టాయిలెట్' అయేందుకు నూతి దగ్గరకు వెళ్లానా, బారెడు త్రాచుపాము కనబడింది. ఇంకేం చేయను? నేను మా పాలేరును కేకేశాను. వాడు మరో పది మందిని కేకేశాడు. ఈ లోగా అది వంటింట్లోకి జొరబడింది. లాఠీలూ, పటకార్లూ తలొకటీ సప్లై చేయించాను. చివర కెలాగైతేనేం, దాన్ని పట్టి హతమార్చి, నోట్లో రాగికానీ పెట్టి దగ్గరుండి కాల్పించి, మీ రింకా ఏమేం ఆరోపణలు చేస్తున్నారో అని సైకిలుపై ఆదరా బాదరాగా వస్తున్నాను” అని ముగించి మళ్లీ, “ఉఫ్ ఉఫ్” అని ఊదుకోసాగాడు.

“హరి, దగ్ధహస్తమా! నువ్వెక్కడున్నా ఇంతేనన్న మాట! ఇంతకూ సారాంశమేమంటే ఒక హింసాకాండ జరిపించి వస్తున్నావన్న మాట!” అన్నాడు రాజారావు ఆశ్చర్యంగా.

“ఔనురా, దెబ్బ తిని అది తప్పించుకుందంటే పగ పట్టి మనల్ని వెంటాడదూ? త్రాచాయెను” అన్నాడు శర్మ.

“సమయం చూసి కాటందుతుంది కూడా” అని శ్రుతి కలిపి, “అది తెల్లదో, నల్లదో, దాని ఒడ్డూ, పొడుగూ అన్నీ చెప్పవేంరా?” అన్నాడు రాజారావు.

నేను నవ్వాను మెల్లగా. రాజారావు కేమనిపించిందో, “ఏమిట్రా, నీ నవ్వూ సీరియస్ కేసుల్లోకూడా?” అని కసురుకున్నాడు.

“పగ పడుతుందా” అన్నాను తల ఊపుతూ.

“అవున్రా, నిజం” అన్నాడు శర్మ నన్ను నమ్మించాలని.

“పాము పగబట్టడంటా వేమిట్రా” అన్నాడు రాజా, నా కామాత్రం తెలియ నందుకు జాలి చూపుతూ.

“ఏడిశారు వెధవలు. ఇంతవరకూ ఎవరెవర్ని ఏ యే పాములు పగపట్టాయో చెప్పు చూద్దాం” అన్నాను సవాలు చేస్తూ.

శర్మ తెల్లమొగం వేశాడు. కాని, రాజారావు— “నీ కోసం మే మేదైనా లిస్టు రాసుకున్నామనుకున్నావా?” అన్నాడు వెనకంజ వేయక.

“ఏమిటి, బాబూ, ఈ వేళప్పుడు వాదులాడుకుంటున్నారు?” అంటూ లావుపాటి దుడ్డుకర్రతో మా పాలేరు గోపాలం వచ్చాడు.

నే నేం మాట్లాడలేదు. రాజారావు విషయమంతా చెప్పి, “ఇప్పుడు చెప్పు, గోపాలం. నీ వెరగని దేముంది? పాములు పగబడతాయా? పట్టవా? ఎప్పుడైనా ఎవరినైనా ఇంతవరకూ పట్టినాయా?” అని అడిగాడు కథలో శౌనకాది ఋషులకు మల్లే.

గోపాలం మా ఇంట్లో మా తాతగారి కాలంనుండీ పాలేరుగా ఉంటున్నాడు. వాని అనుభవానికి దూరమైన విషయం సాధారణంగా ఉండదు. అదీగాక పాములు కొట్టడంలో వాడు అందె వేసిన చేయి.

గోపాలం చుట్టూ చూసి, “చీకటి పడుతున్నది, బాబూ, నడుద్దాం రండి. రే పెప్పుడైనా చెప్పుకుందాం” అన్నాడు. మా సంభాషణలో సంధ్యాసమయమంతా గడిచిపోయిన సంగతి మేము గుర్తించనే లేదు. కీచురాళ్ల ధ్వని తప్ప ఎక్కడా శబ్దమే లేదు. చల్లటి గాలి వీస్తున్నది. గోపాలానికి తలగుడ్డ ఉంది. నాజూకు బలిసిన మా మిత్రత్రయానికది లేదుగా? ఈ చెవిలోనుండి ఆ చెవిలోనికి గాలి దంచుతున్నది. విదియ చంద్రు డెంతో సేపు ఉండడు. నిజంగా ఇంటి కెళ్లవలసిన సమయమే. కాని గోపాలం మాటల వల్ల అతగాడికీ పాములు పగ బట్టిన ఘట్టమేదో అనుభవమైనట్టుగా తోస్తున్నది. అదేదో వినాలని మా కందరికీ గాఢమైన పట్టుదల కలిగింది. మేం ముగ్గురమూ అదేదో చెప్పందే వదల లేదు. గోపాలం తలగుడ్డ ఊడదీసి, మళ్లీ గట్టిగా చుట్టుకున్నాడు. చుట్ట వెలిగించి అన్నాడు:

“ఈ పాముల బాధ మీ కెందుకుంటుంది, బాబూ? ఎక్కడో చదువుకుంటూ అప్పుడప్పుడూ సెలవుల్లో చుట్టపుచూపుగా వచ్చి పోతుంటారు. చదువై ఉద్యోగమైతే అదీ లేదు.”

“అవుననుకో. తెలుసుకుంటే తప్పేముంది?” అన్నాడు రాజారావు.

ఎమ్. సుబ్రహ్మణ్యం

“సరే, వినండి” అని ప్రారంభించాడు గోపాలం.

“ఇప్పు డేముంది, బాబూ? అన్నీ అధ్వాన్నంగానే ఉంటున్నాయి. వెనక మీ తాతగారి కాలం నాటి ఎద్దులకీ, ఇప్పటివాటికీ ఎంత తేడా ఉందనుకున్నారు! ఒక్క ఎద్దులే కాదు, కుక్కలు, గొర్రెలు, మనుష్యులు—అన్నీ అంతే. అట్లాగే పాములుకూడా” అని ఇంకా ఏమో చెప్పబోతూండగా శర్మ అడ్డు వడ్డాడు.

“అయితే, గోపాలం, ఇప్పుడు పాములు పగ పట్టవా?”

“ఏడిసినయ్! మొన్న కుటుంబయ్యగారింట్లో నల్లటి కోడెత్రాచు వచ్చింది. కన్నంలో ఉంది పామంతా. తోకమాత్రమే ఉంది బయట. మా పెద్ద మనవడు దాని తోక పట్టి లాగాడు. వాడు ఒట్టి వెధవ. నే నైతే ఎట్లా ఉండేదో! పాము కాస్తా లోపలికి జారిపోయింది. ఆ కన్నానికి నాలుగు రాళ్లు కొట్టి, ఇంత మట్టి వేశాం. ఇప్పటికి ఏడాది అయింది. ఏం పగ పట్టింది? లాభం లేదు, బాబూ! వాటిల్లోకూడా చేవ చచ్చింది” అని చుట్ట ఆరిపోవటం చూసి చెవిలో పెట్టుకున్నాడు.

“అంతే నంటావా, గోపాలం!” అని దిగాలుపడ్డారు శర్మ, రాజారావు ఇద్దరూ. నేను విజయగర్వంతో చిరునవ్వు నవ్వాను.

“ఇప్పుడు చెప్పబోయేది నా పదహారో ఏట జరిగిన సంగతి లెండి” అని మళ్లా మొదలు పెట్టాడు గోపాలం. మేం ముగ్గురం 'మళ్లీ ఇదేదో కథ ఉందే' అని చెవులు వాడి నోటి కప్పగించి వినసాగాము.

“మా ఇంటి పక్కదొడ్డి ఉంది చూశారూ? అది ఇప్పుడు దొడ్డే అయినా, అప్పుడు ఇల్లే. అందులో శేషయ్య తాత ఉండేవాడు. పిల్లా జెల్లా ఎవరూ లేరు, దూరాన ఎక్కడో ఒకరిద్దరు వారసులు తప్ప. ఆయన కప్పటికే అరవై ఏళ్లు. ఆయన ఒకనాడు ఊరి బయట దొడ్లో చింతచెట్టు కొట్టించాలని అనుకున్నాడు. దాని చుట్టూ ఒక పెద్ద పుట్ట ఉంది. అది ఎప్పుడు పుట్టిందో ఎవరికీ తెలియదు. చెట్టుతోటే పుట్టిందని కొందరూ, చెట్టుకంటె కూడా ముందు పుట్టిందని మరికొందరూ అంటూండేవారు. ఏది ఎట్లా ఉన్నా చెట్టును కొట్టాలంటే ముందు పుట్టను తవ్వాలి. శేషయ్యతాత చెట్టును కొట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు నేనూ, ఎరకల పున్నాయ, వాడి తమ్ముడు వీరడు, యానాది సింగరాయ— మేం

నలుగురం పెచ్చు కూలిమీద ఒప్పుకున్నాం. ఎందుకంటే, పుట్టలో పాముంటుందని ఊహించి ఎవరూ ఒప్పుకోవటం లేదు. మేము నలుగురమూ పాములు కొట్టేవాళ్లమే. కనక పెచ్చుకూలి మీదనైనా ఒప్పుకున్నాము. నే నొక్కడినే ఇరవైలోపు. మిగతా ముగ్గురూ ముప్ఫైలోపు, ఇరవైకి పైన—మాంచి కోడె వయసులో ఉన్నాము.

"ఇప్పుడు మీ రంటే ఇలా సుకుమారంగా ఉన్నారు. ఇరవేండ్లు దాటినా, కాలిలో ముల్లు గుచ్చుకుంటే 'అమ్మో' అని కూలబడి దాన్ని ఊడబీకిందాకా అడుగు తీసి అడుగు పెట్టరు. వెనక మీ వయసులో మేము ఎలా ఉండేవాళ్లం! ఏం హుషారు! తలుచుకుంటే మీకూ, మాకూ ఎంత తేడా, బాబూ!" గోపాలం నెరిసి ముగ్గుబుట్టలా ఉన్న తలపై తలగుడ్డను ఊడదీసి మళ్లా చుట్టాడు.

"ఎలా ఉండేవాళ్లేమిటి?" కుతూహలంగా అడిగాను.

"మాకు ఒక పని అంటే లెక్క ఉండేదనుకున్నారా? ఆ శివాలయంమీదినుంచి ఎగిరి క్రింది కోనేట్లోకి దూకి ఈతలు కొట్టేవాళ్లం. ఎంత లావుపాటి పామునైనా రంధ్రంలో ఉన్నా, తోక పట్టుకుని లాగి గిరగిరా తిప్పి నేలకు కొట్టేవాణ్ణి. పున్నాయ పామును బుజాన వేసుకుని తిరిగేవాడు. వాడు తేలును కాలుతో తన్ని చంపవలసిందే గాని, ఎన్నడూ చెప్పుతో కొట్టేవాడు కాడు. వీరడు సరేసరి. వా డొకనాడు ఊరికి రెండు మైళ్ళ దూరాన ఏదో పనుండి పోయి, అక్కడ పాము కనబడితే కొట్టటాని కేమీ లేక, దాన్ని 'ఇశ్, ఇశ్' అంటూ ఊళ్లోకి తోలుకొచ్చి మరీ చంపాడు. సింగరాయ అర్ధరాత్రి సమయంలోకూడా పామును గురి తప్పకుండా కొట్టేవాడు. అందుకే శేషయ్య తాత చెట్టు కొట్టేందుకు మమ్మల్ని ఎన్నుకున్నాడు.

మేము నలుగురం తాత వెంట దొడ్లోకి వెళ్లాం. నాలుగు గొడ్డళ్ళు, రెండు రంపాలు, రెండు పలుగులు, రెండు పారలు, నాలుగు మాంచి పట్టు కర్రలు తీసుకెళ్లాం. 'జయం కలగాలి' అని చెట్టుకు ఒక నమస్కారం చేసి పని మొదలుపెట్టాం. ఎన్నాళ్లయిందో అది పుట్టి? ఆ నాటితో దానికి ఆయువు తీరింది.

అప్పుడే జనమంతా పొలాలకు బయలుదేరే వేళఅయింది. ఇద్దరు పలుగులతో తవ్వుతుంటే, ఇద్దరం పారలతో మట్టి తీసి అవతల పోయసాగాం. అట్లా పది నిమిషాలు జరిగిందో లేదో లోపలినుంచి 'బుస్సు, బుస్సు' మంటూ శబ్దం వినిపించింది. ఆ సమయంలో పాము లోపలే ఉంది. మేము ఊపిరి బిగబట్టి మా పని చేస్తూనే ఉన్నాం. అంత కంతకూ ధ్వని హెచ్చసాగింది.

శేషయ్యతాత దూరంగా నిలబడ్డాడు. 'అరేయ్, జాగ్రత్త! లేకపోతే ఇంటికి పోదాం, రండిరా. పాడు పని' అంటున్నాడు. కాని మా వయస్సు అప్పుడట్లా వెనక్కు తిరిగే దశలో ఉందా? పున్నాయ, వీరడు ఇద్దరూ చెరో బాణా కర్ర పట్టుకుని రెండు పక్కలా నిలుచున్నారు. నేనూ, సింగరాయా పని మానలేదు. వాడు తవ్వుతుంటే, నేను జాగ్రత్తగా కొంచెం కొంచెమే మట్టి తీసి ఇవతలికి పారబోయసాగాను.

ఉన్నట్లుండి పాము 'రివ్వు'మంటూ పైకి తాటిజువ్వలా పడగ విప్పుతూ ఒక కోనలోంచి నిలువెత్తున లేచి, నిలబడి ఆడింది.

గబుక్కున నేను, సింగరాయ పార, పలుగు విసిరి అవతల పారేసి మా కర్రలు చేతబట్టి నిలుచున్నాం. కాని, ఆహా! అది ఏమి పాము! ఎప్పుడు పుట్టిందో! తెల్లగా, సూర్యరశ్మికి తళతళ మెరుస్తూ లేచి ఆడసాగింది. పాము చాలా లావు ఉంది. దాని పడగ ఎంత వెడల్పు ఉందో! అలాంటి పామును నా జన్మలో మళ్లీ ఇంతవరకు మరొక్క దాన్ని చూడనేలేదు. దాని పడగపై శ్రీకృష్ణపాదాలు స్పష్టంగా ఇంతింత వెడల్పుఉన్నాయి. దానితలపై శ్రీకృష్ణుడు నాట్యం చేస్తున్నట్లే అనిపించింది నా మట్టుకు నాకు. అంత అందమైన పామును, గంభీరమైన పామును చూస్తుంటే నా కెంతో పరవశం కలిగింది. మిగతా ముగ్గురికీ నా లాంటి అనుభవమే కలిగిందేమో? మే మెవ్వరమూ కర్రలు చేతబట్టి చూస్తూ నిలుచున్నామే గాని, దాన్ని ఒక్క దెబ్బకూడా వేయ బుద్ధి కాలేదు.

శేషయ్యతాత ఇంతలో కేకలు పెట్టటం వినిపించింది. "చూస్తారేంరా, మొద్దు వెధవల్లారా? ఊ కొట్టండి. పైన పడి ఎవడినా పట్టి కరిచిందాకా అలాగే ఉంటార్రా?"

ఈ కేకతో మేమంతా ఈ లోకంలోకి వచ్చాం. అప్పటి మా స్థితి మాకు తెలియవచ్చింది. అది ఎంత అందమైన పామైనా దాన్ని చంపక తప్పదు. దాని అందాన్ని చూచి వదిలిపెట్టినా పుట్ట తవ్వినందుకు అది మమ్మల్ని మన్నించి ఊరుకోదు. ప్రస్తుతం తప్పించుకున్నా, తరవాతనైనా పగపట్టి వెంటాడి కరవక మానదు. కాని, ఎలా కొట్టటం?"

"ఏం, గోపాలం, ఎందుకని కొట్టలేదు?" అన్నాము ముగ్గురం ఆత్రంగా.

"పాము మాకు ఎదురుగా పడగ విప్పి నిలుచుని ఉంది. పాము ఎదురుగా నిలుచుని ఉండగా కొట్టటం అసాధ్యం. అసలు అది కొట్టనివ్వదు. సాగిపోతూండగా దాని వాలు చూచి కొట్టాలి. అలా కాక నిలుచున్నపాటునే కర్ర విసిరామో, తక్కున పక్కకు తప్పుకుని పైకి దుముకుతుంది. లెక్కకు మేము నలుగురమున్నా అందరమూ దాని కెదురుగానే ఉన్నాం. కాని, ఒక్కరమూ దానికి వెనకవైపు లేము. దానికి వెనక పుట్ట నానుకుని గోడ ఉంది. మేము కర్తవ్యమాలోచిస్తూండగా పాము విచిత్రంగా దాని వెనకనున్న గోడలోకి దూరింది."

"అరెరె! పాము తప్పించుకుందా?" ముగ్గురమూ తత్తరపడ్డాము.

"అవును. తప్పించుకుంది. ఆ తరవాత ఆ గోడంతా పడగొట్టి వెదికాం. కాని లాభం కలగలేదు. శేషయ్య తాత మాత్రం పామును వదిలి పెట్టినందుకు మమ్మల్ని అందర్నీ తిట్టిపోశాడు. కాని ఏం చేస్తాం? ఆ రోజంతా వెదికినా పాము కనబడలేదు. ఆ మర్నాడు మళ్లీ పుట్ట తవ్వే పనికి పూనుకున్నాం. మా కందరికీ అలుగ్గానే ఉంది. నిదానంగా పుట్టంతా తవ్వేశాం. పాము ఎటు పోయిందో, జాడైనా లేదు. పుట్ట లోపల సుమారు రెండు వందలు గుడ్లున్నాయి. శేషయ్యతాత ఆజ్ఞ ప్రకారం ఆ గుడ్లన్నీ చితకపొడిచాం. ఆ తరవాత నాలుగు రోజుల లోపలే చెట్టంతా కొట్టేసి మా కూలి మేం పట్టుకుపోయాము" అని గోపాలం చుట్ట ముట్టించబోయాడు.

"నీ చుట్ట తగలెయ్య!" శర్మ విసుక్కున్నాడు.

"మరే, బాబూ!" ముసిముసిగా నవ్వాడు గోపాలం.

"తరవాత తగలేద్దువు గానిలే. అంతటితో అఖరేనా? ఇంకా ఏమైనా జరిగిందా?" అని అడిగాడు రాజారావు.

గోపాలం తాపీగా చుట్ట పీలుస్తూ, "లేకేం, బాబూ, ఉన్న గ్రంథమంతా ముందే ఉంటేను" అన్నాడు.

"ఇదుగో, గోపాలం! ఇంటికి పోగానే నీకు రెండు వీశల పొగాకు ఇస్తాగాని, జరిగిందేదో త్వరగా చెబుదూ" అని ప్రాధేయపడ్డాడు శర్మ, ఆలస్యాన్ని సహించలేక.

గోపాలం మరి నాలుగు దమ్ములు లాగి ఇలా చెప్పుకుపోయాడు: "చెట్టు తాలూకు కలప అంతా ఇంట్లోకి చేర్పించుకున్నాడు శేషయ్యతాత. ఆ రోజు రాత్రి సుమారు ఎనిమిది గంటలయి ఉంటుంది. నేను స్నానం చేయబోతున్నాను. పక్కనే శేషయ్యతాత ఇంట్లోంచి చావు కేక వినిపించింది. ఉన్నవాణ్ణి ఉన్నట్లుగానే మూలనున్న కర్ర ఒకటి తీసుకుని, శేషయ్యతాత ఇంట్లోకి పరుగెత్తాను. అక్కడ నేను చూచిన దృశ్యం ఈ నాటికీ మరువరాదు, బాబూ!" గోపాలం తల గుడ్డ ఊడదీసి మళ్లీ చుట్టసాగాడు.

"ఊ ఏమి చూశావు! మమ్మల్ని చంపక చెప్పు!" అన్నాము ముగ్గురమూ.

## స్వాగతము

కొమ్మకొమ్మయుఁ జివురించి కుల్కనించె
పువ్వుఁ బువ్వును వికసించి పొల్పుఁ బెంచె
తెలుగు వనకన్య క్రొంగ్రొత్త వెలుగు దాల్చె
శ్రీ పరీధావి మన చెంత చెలిమి నిల్చె!

చక్కదనమున గర్వించి తెక్కలార్చి,
తొక్కుపల్కుల చిల్కలు తోష మొసఁగె;
వింత చవులూర హర్షించి గొంతునెత్తి,
తీయ పాటల కోయిలల్ హాయిఁ గూర్చె!

సాంఘికార్థిక నైతిక సకల రంగ
ములను తెలుగునా డభివృద్ధి నలరి యలర
సేవ తీవి దనర పరీధావి! మమ్ము
పాలనము సేయ రమ్మిదె! స్వాగతమ్ము!

-శ్రీవత్స

గోపాలం తలగుడ్డ పూర్తిగా చుట్టి ఇలా అన్నాడు: "శేషయ్యతాత వంటింటి కవతలి ఉన్న దొడ్లో ఉన్నాడు. మనిషి అటూ, ఇటూ ఊగిపోతున్నాడు. మనిషి సరిగ్గా క్రిందపడబోయేసరికి కర్ర క్రింద పడేసి నేను వెళ్ళి పట్టుకున్నాను. ఎదురుగా చూపు నిలిపాను. అప్పుడు తెలిసి వచ్చింది కారణం ఏమిటో! సరిగ్గా పుట్ట తవ్వేనాడు ఏ పామును ఏ స్థితిలోనైతే చూచానో— అదే పాము, అదే స్థితిలో నిలబడి నాట్యం చేస్తున్నది. తెల్లని త్రాచు. చంద్రకిరణాలు దానిపై పడి దాని అందానికి వన్నె తెస్తున్నాయి. నాలుకలు ముందుకు జాపి బుసలు కొడుతున్నది. 'ఏమిటి, ఏమి' టంటూ కేక విన్న జనం అంతా ఇంట్లోకి గోల చేసుకుంటూ రాసాగారు. ఆ గోలకు పాము వెనక్కు తిరిగిపోసాగింది. నా కప్పుడు స్పృహ వచ్చింది. తాతను నెమ్మదిగా నేలమీదనే పడుకోబెట్టి, కర్ర తీసుకుని వెంట పడ్డాను. కాని, పది గజాల దూరంలోనే ఉన్న చొప్పవామిలో దూరబడింది పాము.

జనమంతా క్రిందపడి ఉన్న తాతనూ, కర్ర తీసుకుని అటూ ఇటూ వెదుకుతున్న నన్నూ చూచి ప్రశ్నల వర్షం కురిపించారు. నేను జరిగిన సంగతి చెప్పాను. అందులో ఒకడు తాతను పరిశీలించి, 'పాము తాతను ఏమీ చేయలేదులే' అని తృప్తిగా నిట్టూర్చాడు. ఇంతలో నేనూ తాత దగ్గరకు వచ్చాను. అప్పటి కాయన కళ్ళు తెరిచి చూడసాగాడు. నా సాయంతో లేచి నిలబడ్డాడు. జరిగిన సంగతి చెప్పాడు. ఆయన ఎద్దులకు మేత వేద్దామని దొడ్లోకి వెళ్ళాడట. 'బుస్సు'మని పాము ఎదురైందట. అది పాములా కాక, మృత్యుదేవతలా కనిపించిందట ఆయనకు. వెర్రికేక పెట్టాడు. కాళ్ళు, చేతులు స్వాధీనం తప్పసాగినాయి. అంతలో నేను వెళ్ళాను.

వచ్చినవాళ్ళంతా ఎవరికి తోచిన మాటలు వాళ్ళు పలికి, ఎవరి దారిని వాళ్ళు వెళ్ళారు. 'తాతా, జాగ్రత్త!' అని నేనూ బయలుదేరాను. కాని, తాత నా చేతులు పట్టుకుని, 'నువ్వు పోవద్దురా! నా కెందుకో భయంగా ఉంది. ఈ రాత్రి కిక్కడే పడుకో' అని బ్రతిమిలాడాడు. నే నెన్ని ఓదార్పు మాటలు చెప్పినా వినలేదు.

'కావలిస్తే పున్నాయను, వీరణ్ణి, సింగరాయునుకూడా పిలిపిస్తాను. మీరు నలుగురూ ఉంటేనేగాని నాకు భయం తీరదు' అంటూ అప్పటికప్పుడే వాళ్ళను కూడా పిలిపించాడు. ఆ ముగ్గుర్నీ అక్కడ వదిలి నేనూ అన్నం తిని వచ్చాను. మేము నలుగురమూ కర్రలతో రాత్రంతా మేలుకునే ఉన్నాము, పాము వస్తుందేమోనని. కాని పాము రాలేదు. రాత్రంతా శేషయ్యతాత కలవరిస్తూనే ఉన్నాడు. మధ్య మధ్య వెర్రికేకలుకూడా పెట్టసాగాడు. మేము లేపి 'ఏమిటి' అని అడిగితే, 'పాము. అది నా వెంట పడుతున్నది. నే నెటు పోతే అటల్లా వస్తుంది. అది నన్ను చంపక వదిలేట్లు లేదురా!' అని ఏడవ సాగాడు. పాపం! మా కెంతో జాలి కలిగింది. ఎలాగో ఆ రాత్రి తెల్లవారింది. ఆ పగలుకూడా తాత నన్ను వెళ్ళనివ్వలేదు. తానే కూలి ఇచ్చి వెంట ఉంచుకున్నాడు.




ఆ రోజునుంచి తాత మంచంమీదనే ఎక్కువగా కాల గడపసాగాడు. ఏదైనా అవసరం ఉండి దిగిపోవలసి వస్తే నేను వెంట లేనిదే ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు!"

రాజారావు సైంధవుడిలా అడ్డుకున్నాడు. "మంచము మీదుంటే పాము రాదా, గోపాలం?"

"వచ్చినా కోటికి పడగెత్తదంటారు" అని మళ్ళా సాగించాడు గోపాలం.

"పాము బాధ వదిలించుకునేందుకు తాత జపాలు చేయించాడు. తపాలు చేయించాడు. అభిషేకాలు చేయించి, బ్రాహ్మణులకు నాగప్రతిమను దానం చేశాడు. ఇంకా ఏమేమో చేసి చూశాడు. కాని, పాము మాత్రం ఆ ఇంటి పరిసరాలు వదిలి పోలేదు. గోడలోనో, వామిలోనో, దిబ్బలోనో—ఎక్కడో దాగి ఉండేది. అది విడిచిన కుబుసాలు కొష్టంమీద, గోడలమీద, దిబ్బలమీద—ఎక్కడ పడితే అక్కడ కనపడసాగాయి.

ఇలా కాదని తాత ఆ ఇల్లు మార్చాడు. పాము ఆ ఇంట్లోకూడా ప్రత్యక్షమైంది. ఆ ఊరుకూడా మార్చి పక్క ఊరిలో ఉన్నాడు కొన్నాళ్ళు. పాము అక్కడా వెంట పడింది. తాత మళ్ళీ ఇంటికి వచ్చాడు. పాముకూడా వచ్చింది. ఆయన ఎక్కడికి పోయినా నేను వెంట ఉండవలసిందే. ఇట్లా మూడేళ్ళు గడిచాయి.

తాతను గురించి, పామును గురించి చుట్టుపక్కల పది, పదిహేను ఊళ్ళలో కట్టుకథలు కూడా బయలుదేరాయి. 'తాత ఇంట్లోకి వెళ్ళి "శేషయ్యతాతా" అని పిలిస్తే పాము "బుస్సు"న పైకి లేస్తుందట' అని చెప్పుకోసాగారు జనం. నే నిది నమ్మక దొడ్లోకి వెళ్ళి ఒకసారి 'శేషయ్యతాతా!' అని పిలిచాను. పాము రాలేదు. మన మునసబుగారి కొడుకు 'ఎందుకు రాదూ? నేను చూపిస్తానుండు' అని వచ్చాడు. నాకూ పామును చూద్దామని చాలా కుతూహలంగా ఉంది. అతని వెంట దొడ్లోకి వెళ్ళాను. అతను 'శేషయ్య తాతా' అని పిలిచాడు. జనమంతా చెప్పుకుంటున్నది నిజమే. దిబ్బలోనుంచి పాము 'బుస్సు' మని కొద్దిగా లేచింది. కాని ఇదెక్కడి పాము? ఆ నాటి పాముకూ, దీనికీ పోలికే లేదు. ఇది చిక్కి శల్యమై చావుకు సిద్ధమై ఉంది. కళా కాంతులు ఏమీ లేవు" అని గోపాలం తలగుడ్డ ఊడదీసి మళ్ళా చుట్టాడు.

"ఏం, ఎందుకని, గోపాలం?" అడిగాం ముగ్గురమూ.

"పగ పట్టిన తరవాత పాము మేత ముట్టదు, బాబూ! దాని వ్రతం పూర్తి అయితేనే అది మళ్ళీ ఆహారం తీసుకునేది. కాని, పామును చూశాక నాకు కళ్ళనీళ్ళ పర్యంతమైంది, బాబూ! నా కా రోజంతా అన్నమే సయించలేదు. కాని, చేసే దేముంది? రోజులు మాత్రం గడిచి పోతున్నాయి."

"చివరి కేమయింది, గోపాలం?" అన్నాడు రాజారావు.

"ఇంకేముంది, బాబూ! వ్రతం పూర్తి అవకముందే దాని జీవితం ముగిసిపోయింది. ఒకనాటి రాత్రి చివరిసారిగా మళ్ళీ ప్రయత్నం చేద్దామనో, ఏమో శేషయ్యతాత మిద్దె గడపలోకి వచ్చి, ఆ పైన ఇక రాలేక అక్కడే ప్రాణాలు వదిలింది. తెల్లవారినాకగాని ఇది మేము గ్రహించలేదు. మళ్ళీ పది రోజులదాకా ఈ విషయమంతా చెప్పుకున్నారు గ్రామస్థులంతా. ఆ తరవాత తాత కొద్ది రోజులే జీవించాడు. ఆయన మరణానంతరం వారసులు వచ్చి ఆయన ఆస్తి పంచుకు పోయారు. మునసబుగారాయన ఇల్లు కొని దొడ్డిగా వాడుకుంటున్నారు" అని ముగించాడు గోపాలం.

అప్పటికి ఎనిమిది దాటింది. "ఇక పోదాం. పదండి, బాబూ!" అని దారి తీశాడు గోపాలం.

"అయితే, గోపాలం, నువ్వు వెంట ఉండకపోతే పాము తాతను చంపేసేదే నంటావ్?" శర్మగాడి ప్రశ్న.

"సందేహ మెందుకు, బాబూ!" అని చుట్ట వెలిగించాడు గోపాలం.

ఊళ్ళోకి వచ్చాం. నాకు హఠాత్తుగా ఒక అనుమాన మొచ్చింది. "గోపాలం, పుట్ట తవ్వింది మీరైతే పాము తాత నెందుకు పగ పట్టింది?" అని అడిగాను. మిగతా ఇద్దరూ, "నిజమే, ఎందుకని?" అన్నారు.

గోపాలం తన ఇంటి ముం దాగి, "పట్నాలకు వెళ్ళి పెద్ద చదువులు చదువుతున్నారు గదా! పాము పగ ఎవరి మీా దుండాలో ఆమాత్రం ఆలోచించండి, బాబూ!" అని లోపలికి వెళ్ళాడు.

మే మొకరి ముఖా లొకరు చూసుకున్నాము.

*